గంజాయి మత్తు.. యువత చిత్తు

- విచ్చలవిడిగా పెరిగిన వినియోగం
- విద్యాసంస్థలకూ పాకిన మహమ్మారి
- తరలిస్తూ పట్టుబడుతున్న యువకులు

మధురపూడి: సమాజాభివృద్ధిలో యువత పాత్ర చాలా కీలకం. దేశ ప్రగతిలో ముఖ్య భూమిక పోషించాల్సింది కూడా వీరే. అయితే ఆధునిక యువత మత్తు పదార్థాలకు బానిస కావడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా గంజాయి తాగుతూ భవిష్యత్తును నాశనం చేసుకుంటోంది. ఇటీవల వెలుగులోకి వస్తున్న అనేక ఘటనలు దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. కొందరు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి విద్యాసంస్థల్లో వినియోగిస్తున్నారు. దీనికి అలవాటు పడిన యువత అనారోగ్యం పాలవుతున్నారు.

పెద్దల అండదండలు

కూటమి ప్రభుత్వంలోని పెద్దల అండదండలతో గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదారులు, మారుమూల ప్రాంతాలన్నింటినీ రవాణకు అనుకూలంగా చేసుకుంటున్నారు. ప్రభుత్వ అలసత్వం కారణంగా విద్యాసంస్థలో సైతం గంజాయిని వినియోగిస్తున్నారని సమాచారం.

నియోజకవర్గంలో..

మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో అటవీ ప్రాంతం మీదుగా గంజాయి రవాణా అవుతోంది. జాతీయ రహదారులు ఉండటంతో రవాణాకు అనుకూలమైంది. ఈ మార్గాల మీదుగా పెద్ద పట్నాలు, మహానగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ఒడిశా నుంచి విశాఖ జిల్లా అటవీ ప్రాంతం మీదుగా గంజాయి రవాణా జరుగుతోంది. వీటికి సమీపంలోనే రోడ్డు, రైలు మార్గాలుండటంతో వాటి ద్వారా సుదూర ప్రాంతాలకు గంజాయిని తరలిస్తున్నారు.


ఇటీవల ఐదుగురు యువకులు గంజాయితో పట్టుబడిన కోరుకొండ మండలం అయ్యన్నగళ్లు సమీపంలోని రోమ్ సిటీ ప్రాంతం


గంజాయి రవాణాకు అనుకూలంగా మారిన జంబూపట్నం రోడ్డు

దారులివే..

గంజాయిని తరలించడానికి స్మగ్లర్లు కొన్ని రోడ్డు మార్గాలను ఎంపిక చేసుకుంటున్నారు. పోలీసులు, చెక్ పోస్టులను తప్పించుకుంటూ, ఆ రహదారుల మీదుగా శరవేగంగా తరలిస్తున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ నుంచి జగ్గంపేట మండలం మల్లిసాల మీదుగా వయా గోకవరం మండలం తిరుమలాయపాలెం, కోరుకొండ మండలం కణుపూరు మీదుగా గాదరాడ, రాజానగరం మండలం సీతారామపురానికి చేరుకుని, అక్కడి నుంచి జాతీయ రహదారి పైకి ఎక్కుతున్నారు. అలాగే ఇదే రూటులో కోరుకొండ మండలం కణుపూరు మీదుగా జంబూపట్నం, అయ్యనగళ్ల సమీపంలోని రోమ్‌సిటీ మీదుగా తరలిస్తున్నారు. అలాగే మల్లిసాల, కణుపూరు, నర్సాపురం నుంచి వయా దోసకాయలపల్లి, రాజానగరం జాతీయ రహదారి గుండా తరలింపు జరుగుతోంది. రాజమహేంద్రవరం నుంచి కొందరు విద్యార్థులు పిక్నిక్ కోసం ఏజెన్సీ ప్రాంతాలకు వెళుతున్నారు. వచ్చేటప్పుడు బ్యాగుల్లో గంజాయిని తీసుకువస్తున్నారు. ఇక్కడి నుంచి రైలు, రోడ్డు మార్గాల ద్వారా సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గతంలో గుంటూరు ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఇలాగే బ్యాగుల్లో గంజాయిని తరలిస్తూ పోలీసులకు చిక్కారు.


సిగరెట్ మాదిరిగా పేపర్‌లో చుట్టిన గంజాయి

కోరుకొండ సర్కిల్ పరిధిలో..

కోరుకొండ సర్కిల్‌పరిధిలో పలు గంజాయికేసులు నమోదయ్యాయి. గత ఐదేళ్లలో సుమారు 1500 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 17వ తేదీన ఐదుగురు యువకులు 1.700 కేజీల గంజాయితో పోలీసులకు చిక్కారు. వీరంతా రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, శ్రీరాంపురం తదితరగ్రామాలకు చెందిన వారే కావడం విశేషం. వీరంతా గంజాయిని చిన్నపొట్లాలుగా తయారు చేసుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారు.

నియంత్రణకు చర్యలు



గంజాయి రవాణా, వినియోగాన్ని నిర్వీర్యం చేయడానికి ఈగల్, నార్కోటిక్ టీమ్‌లను ఏర్పాటు చేశాం. గట్టి చర్యల ద్వారా గంజాయి రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు కృషి చేస్తున్నాం. ముందస్తు చర్యల్లో భాగంగా విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలను యువతకు తెలియజేస్తున్నాం.

– వై.సత్య కిషోర్, సీఐ, కోరుకొండ,

అనేక అనర్థాలు



గంజాయిని వినియోగించడం ద్వారా యువత భవిష్యత్తు నిర్వీర్యం అవుతోంది. రెగ్యులర్‌గా గంజాయిని వాడటంతో మెదడు సమస్యలు ఉత్పన్నమవుతాయి. నరాల సంబంధిత వ్యాధులు సోకుతాయి. యువత మానసిక ప్రశాంతతను కోల్పోతారు. నిరాశ, నిస్పృహలతో ఉంటారు. గంజాయికి బానిసలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ జ్ఞానచంద్ర, పీహెచ్‌సీ, కోరుకొండ

యథేచ్ఛగా రవాణా



కూటమి ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టకపోవడంతో గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతోంది. విశాఖ ఏజెన్సీ, ఒడిశా నుంచి దేశంలోని అనేక ప్రాంతాలకు రవాణా అవుతోంది. ప్రభుత్వంలోని పెద్దల అండదండలతోనే గంజాయి రవాణా జరుగుతోంది.

– అడపా కనకరాజు, కన్వీనర్, వైఎస్సార్ సీపీ, కోరుకొండ

పరిశుభ్ర గ్రామాల రూపకల్పనకు కృషి


సత్యనారాయణరెడ్డి, ఈఓపీఆర్డీ

పెదపూడి: ఆరోగ్యవంతమైన, పరిశుభ్రమైన గ్రామాల రూపకల్పనకు అందరూ కృషి చేయాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని సచివాలయ కార్యదర్శులకు బుధవారం పెదపూడిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావడానికి సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాధ్యతయుతంగా పనిచేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గ్రామానికి క్లాప్ మిత్రలను విధిగా నియమించి, ప్రతి రోజు ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. దాన్ని సంపద తయారీ కేంద్రాలకు తీసుకెళ్లి, తడి చెత్తను వర్మీ కంపోస్టుగా, పొడి చెత్త అనగా ప్లాస్టిక్ తదితర వాటిని రీసైకిల్ కోసం విక్రయించాలన్నారు.

వినాయకునికి గరిక పూజ


ప్రత్యేక అలంకరణలో వినాయక స్వామి

పెదపూడి: సంపర గ్రామంలోని పంట కాలువ సమీపంలో కొలువైన సిద్ధి వినాయకునికి బుధవారం గరిక పూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

వైభవంగా రాట ముహూర్తం


రాట ముహూర్తం చేస్తున్న భక్తులు

బిక్కవోలు: గ్రామంలోని కేదారేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాట ముహూర్తం చేశారు. ఈ ఆలయం వద్ద ఈ నెల 26న శివరాత్రి మహోత్సవానికి దీపాలంకరణ అరప రాటను ప్రతిష్ఠించారు. బొల్లారెడ్డి లక్ష్మీనారాయణ, గోవర్ధన దంపతుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనివాసరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు యామసాని రవి, జంగా గంగాధర్ రెడ్డి, తాళ్ల నీరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హిందీ భాషోత్సవం


విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం వీరభద్రరావు, ఉపాధ్యాయులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం హిందీ భాషోత్సవం నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయులు నిర్మల రాజేశ్వరి, విశాలాక్షి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధానోపాధ్యాయుడు వీరభద్రరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ హిందీపై పట్టు సాధించాలన్నారు. ఆ భాషలో ప్రావీణ్యం చూపిన విద్యార్థినులకు హెచ్ఎం వీరభద్రరావు, గణిత ఉపాధ్యాయుడు కస్తూరి సతీష్‌బాబు, పీడీ సింహాద్రి చేతుల మీదుగా బహుమతులు అందించారు.

ఆర్యవైశ్య సంఘం వైస్ చైర్మన్‌గా కిశోర్



సీతానగరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం వాణిజ్య విభాగం వైస్ చైర్మన్‌గా ఇనుగంటివారిపేటకు చెందిన చలంచర్ల మోహన్ కృష్ణ కిశోర్ ఎంపికయ్యారు. అన్నవరంలోని శ్రీనివాస కల్యాణ మంటపంలో బుధవారం ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు ప్రగళ్లపాటి కనకరాజు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీలను ఏర్పాటు చేశారు.

ఎయిర్‌పోర్టు డైరెక్టర్ బదిలీ


బదిలీపై వెళుతున్న డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు, కుటుంబ సభ్యులు

మధురపూడి: రాజమహేంద్రవరం విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు తమిళనాడులోని తిరుచ్చికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కుటుంబ సమేతంగా చెన్నైకి ఇండిగో విమానయాన సర్వీసులో వెళ్లారు. ఆయనకు టెర్మినల్ భవనం వద్ద ప్రముఖులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎయిర్ పోర్టు డైరెక్టర్ (ఇన్‌చార్జి) ఎన్కే శ్రీకాంత్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి, టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ మృతి


ఘటనా స్థలంలో లారీ డ్రైవర్ శ్రీనివాసరావు మృతదేహం

రాజానగరం: లారీ చక్రాలలో గాలిని తనిఖీ చేస్తున్న డ్రైవర్.. పక్కనుంచి మరో లారీ రాసుకుంటూ వెళ్లడంతో రెండు లారీల మధ్యలో నలిగిపోయి మృతి చెందాడు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు వద్ద గామన్ బ్రిడ్జిపై బుధవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం నుంచి మహారాష్ట్రకు ఇనుప ఈచల లోడుతో వెళ్తున్న లారీని డ్రైవర్ ఆకుల శ్రీనివాసరావు (45).. పై ప్రాంతంలో రోడ్డు పక్కగా ఆపి, టైర్లలో గాలిని తనిఖీ చేస్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న మరో లారీ చీకటిలో ఆగి ఉన్న లారీని రాసుకుంటూ వెళ్లిపోయింది. దీంతో రెండు లారీల మధ్య నలిగిపోయి శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడు రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేటకు చెందినవాడని కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై మనోహర్ తెలిపారు.

రక్తదానంపై అవగాహన ర్యాలీ


అనపర్తిలో ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: యువత రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మనం సైతం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరంపై నిర్వహించారు. దీనికి సంబంధించిన అవగాహన ర్యాలీని ముందుగా మాజీ ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయండి - ప్రాణదాతలు కండి, డొనేట్ బ్లడ్ - సేవ్ లైఫ్ అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

రాజానగరం: హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 2వ అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.ప్రకాష్ బాబు తీర్పునిచ్చారు. 2021లో నమోదైన ఈ కేసు వివరాలను సీఐ వీరయ్య గౌడ్ బుధవారం వెల్లడించారు. నందరాడకు చెందిన చప్పిడి శివకాశిపై దువ్వాటి శామ్యూల్ చాకుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదుపై అప్పటి ఎస్సై నాగబాబు కేసు నమోదు, నిందితుడిని అరెస్టు చేశారు. విచారణలో అతనిపై మోపబడిన అభియోగం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పీపీ పీవీపీ ఎస్‌బీ రాజు వాదించారు.

మద్యం మత్తులో భార్యపై దాడి

సీతానగరం: మద్యం మత్తులో ఒక వ్యక్తి తన భార్యపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. హెడ్ కానిస్టేబుల్ వి.శ్రీను బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్గళ్లకు చెందిన ఈతకోటి పాప, లక్ష్మణరావుకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. అయితే లక్ష్మణరావు మద్యానికి బానిసై, తరచూ భార్యను కొట్టడంతో పాటు మానసికంగాను వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 17 రాత్రి 11 గంటలకు మద్యం తాగివచ్చి, బీరు బాటిల్‌తో భార్య పాప తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమె రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన శిక్షలు

రంగంపేట: బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన శిక్షలకు గురికాక తప్పదని మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది మడికి రాంబాబు అన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ సుప్రీం కోర్టు నల్సా వారి ఆదేశాల మేరకు పెద్దాపురం కోర్టు 7వ జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.చంద్రమౌళేశ్వరి ఆదేశాల మేరకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, దివ్యాంగుల యోగక్షేమాలపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. దీనికోసం న్యాయశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, అంగన్‌వాడీ, ఆశ, ఏఎన్ఎం, వైద్యాధికారులు తదితర 14 మంది సభ్యులతో టీమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా బుధవారం ఈ టీమ్ సభ్యులు మండల పరిధిలోని చంద్రేడు, బాలవరం గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించారు. దివ్యాంగుల యోగక్షేమాలు, వారికి లభిస్తున్న వైద్యం, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, సదరన్ సర్టిఫికెట్లు వచ్చాయా, లేదా అని తెలుసుకున్నారు.


పెదరాయవరంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న అధికారుల బృందం

బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, శిక్షలు గురించి ఇంటింటికీ తిరిగి తెలియజేయడమే కాకుండా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణు శ్రీలక్ష్మి, న్యాయవాది మడికి రాంబాబు, పీఎల్‌వీలు నూతలపాటి అప్పలకొండ, డి.విజయ, ఎంపీహెచ్ఈఓ పి.ప్రసాద్, ఎంపీహెచ్ఏ జి.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

వంగలపూడి రేవు పరిశీలన

సీతానగరం: మండలంలోని వంగలపూడి రేవును తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.భారతి బుధవారం పరిశీలించారు. శివరాత్రిని పురస్కరించుకుని ఆ రేవు నుంచి పట్టిసీమ వీరభద్రుని ఆలయానికి వెళ్లే మార్గం ఏర్పాటుకు ఈ పరిశీలన చేశారు. గోదావరిలో నీటిమట్టం, ఎన్ని తూరలు వేయాలనే విషయంపై చర్చించారు. అలాగే భక్తులు సేదతీరడానికి టెంట్లు, తాగునీరు, బారికేట్లు, వైద్యశిబిరాలు ఏర్పాటుపై కూడా చర్చించారు. వారి వెంట ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి ఆర్.సుజాత, కొంచ చంద్రభాస్కరరావు ఉన్నారు.


వంగలపూడి రేవును పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ అన్యాయాన్ని ఎదిరించడంతో అందరూ శివాజీని మార్గదర్శకంగా తీసుకోవాలని సూచించారు. చరిత్ర అధ్యాపకులు ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ స్త్రీలను గౌరవించి, శివాజీని అందిరికీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.హరేరామకృష్ణ, అధ్యాపకులు ఎం.సుధామయి, డీవీ నాగేశ్వరరావు, బి.మాధవ్, ఎ.వాణి, ఎ.వెంకటేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టిబాబు

నియామకాలలో రిజర్వేషన్లు పాటించాలి

రాజానగరం: యూనివర్సిటీలలో చేపట్టే నియామకాలలో రిజర్వేషన్లను తప్పనిసరిగా పాటించాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ రమణ విజ్ఞప్తి చేశారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ వరహాలదొర అధ్యక్షతన బుధవారం జరిగిన గిరిజన ఉద్యోగుల సమావేశంలో అయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యూనివర్సిటీలో బోధన, బోధనేతర విభాగాలలోని గిరిజన ఉద్యోగులు, విద్యార్థుల శాతాన్ని తెలుసుకుని, వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. గిరిజనులకు కనీసం ఆరు శాతం కేటాయించాల్సి ఉండగా, ఇక్కడ అది అమలు జరగడం లేదన్నారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ ఆచార్య టి.అశోక్, అధ్యాపకులు పి.కృష్ణ, బి.నాగార్జున, ఎం.భాస్కర్, గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు.


రిజిస్ట్రార్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రమాదాల నియంత్రణలో యువతే కీలకం

రాజానగరం: రోడ్డు ప్రమాదాల నియంత్రణలో యువత కీలక పాత్ర పోషించాలని ఏఎస్పీ ఎన్‌బీకే మురళీకృష్ణ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో బుధవారం 'రోడ్డు భద్రత – కౌమార దశలో క్యాన్సర్' పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం అంటే ఒకరితో పోదని, కుటుంబాలే నష్టపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించాలన్నారు. జిల్లాలో 2022లో 313 మంది, 2023లో 349 మంది, 2024లో 243 మంది రోడ్డు ప్రమాదాలలో చనిపోయారన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చి, ప్రాణాలు కాపాడిన వారికి ప్రభుత్వం రూ.ఐదు వేలు ప్రోత్సాహకం అందజేస్తోందన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలపై అవగాహన లేకుండా, అతి వేగంగా వాహనాలను నడపడమే ప్రమాదాలకు ప్రధాన కారణమన్నారు. అంకాలజిస్టు డాక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఆరోగ్యాన్ని అందించే ఆహారం కూడా రెడీమేడ్ అవ్వడంతో క్యాన్సర్ కేసులు పెరిగిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.విద్య, డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్, ప్రిన్సిపాళ్లు ఆచార్య డి.జ్యోతిర్మయి, డాక్టర్ పి.విజయ నిర్మల, డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, సీఐ వీరయ్య గౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ మురళీకృష్ణ

నరసన్న రథానికి పూజలు


నరసింహస్వామివారి రథం

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు మార్చి 9 నుంచి నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రథాన్ని మరమ్మతు పనుల కోసం బుధవారం బయటకు తీశారు. దీనిలో భాగంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

నేడు సమావేశం

ఉత్సవాల నిర్వహణ, తీసుకోవాల్సిన చర్యలపై గురువారం సమావేశం నిర్వహించనున్నారు. దీనికి కలెక్టర్ ప్రశాంతి, తదితర అధికారులు హాజరవుతారని ఆలయ అనువంశిక ధర్మకర్త రంగరాజ బట్టర్ తెలిపారు.

ప్రీ ప్రైమరీ విద్య బలోపేతానికి కృషి

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న ప్రీప్రైమరీ విద్యను బలోపేతం చేయడానికి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని మండల విద్యాశాఖ అధికారులు – 1, 2 కె.సత్యనారాయణ, సీవీవీ సత్యనారాయణ అన్నారు. పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండో రోజు బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జరిగిన శిక్షణను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరేళ్ల లోపు చిన్నారులకు పౌష్టికాహారం, ఆటపాటలతో విద్యను అందించే విషయంపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్పీలు సాయి వెంకటేష్, ఏఎస్ఎన్ లోవరాజు, ఆర్.శ్రీనివాస్, వై.శ్రీగౌరీ, సీహెచ్. శ్రీపద్మ పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్య

బిక్కవోలు: జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు వృత్తి నైపుణ్య శిక్షణ రెండో రోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఊలపల్లి ఉన్నత పాఠశాలలో ఎంఈవో – 2 కె.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఆరు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో ప్రీ స్కూల్ నిర్వహణ, చిన్నారులకు విద్య బోధన చేయడంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఏఎంవో గౌరీ శంకర్, పాఠశాల హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతిరత్న కుమారి పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆహ్లాదకర బోధన

రంగంపేట: విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఆకర్షణీయమైన కృత్యాలు తయారు చేసి, ఆహ్లాదకరమైన విద్యా బోధన చేయడానికి కార్యకర్తలు చైతన్యవంతులు కావాలని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు, కోర్సు డైరెక్టర్ వి.పార్థసారధి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి రెండోరోజు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.